తహసీల్దార్ కార్యాలయంలో తాగునీటి కొరత

తహసీల్దార్ కార్యాలయంలో నీళ్లు పోయకపోవడంతో ఖాళీగా ఉన్న రిఫ్రిజిరేటర్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 4 : తహసీల్దార్ కార్యాలయంలో తాగేనీళ్లు దొరక్క కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్కతుర్తి రెవెన్యూ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న సెరికల్చర్ భవనంలో కొన్నేళ్లుగా తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. కొన్ని నెలల క్రితం ప్రజల కోసం అధికారులు తాగునీటి వసతి కల్పించారు. అయితే ప్రస్తుతం కార్యాలయంలో ఉన్న వాటర్ ప్యూర్ ఫైర్ మిషన్, రిఫ్రిజిరేటర్‌లో నీళ్లు పోయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం కావడం, అనుకున్న సమయానికి రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో గంటల తరబడి ప్రజలు అక్కడే ఉండాల్సి వస్తున్నది. కార్యాలయంలో నీళ్లు లేకపోవడంతో వాటర్ బాటిల్ కొనుక్కోవాలంటే కిలోమీటర్ దూరంలో ఉన్న ఎల్కతుర్తికి వెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయంలో తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రౌడీషీటర్లపై నిరంతరం నిఘా పెట్టాలి

- సీపీ సన్‌ప్రీత్‌సింగ్
- హనుమకొండలోని సీపీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం

నేర సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

సుబేదారి, ఏప్రిల్ 4 : గంజాయి కేసుల్లో నేరస్తులను వెంటనే అరెస్ట్ చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో ఫిబ్రవరి నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, రౌడీషీటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల వ్యక్తిగత సమాచారం తెలుసుకొని, వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. రాత్రి సమయంలో ముమ్మరంగా పెట్రోలింగ్ చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేయాలని, ప్రజావాణి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్‌సలీమా, అంకిత్‌కుమార్, రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ మనన్‌భట్ తదితరులు పాల్గొన్నారు.

పరకాల, శాయంపేట పోలీస్ స్టేషన్ల తనిఖీ..

పరకాల : పరకాల, శాయంపేట పోలీస్ స్టేషన్లను సీపీ సన్‌ప్రీత్ సింగ్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది, అధికారుల వివరాలు, పెండింగ్ కేసులపై సీఐలు కాంత్రికుమార్, రంజిత్ రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉండి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అవసరమన్నారు. శాయంపేట స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి? స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్లు ఉన్నాయి? బ్లూకోల్ట్స్ సిబ్బంది పని తీరుపై అని ఆరా తీశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, ఇన్‌స్పెక్టర్ రంజిత్, ఎస్సై పరమేశ్ పాల్గొన్నారు.

హిందూ విజయ యాత్రను విజయవంతం చేయాలి

మడికొండ, ఏప్రిల్ 4 : శ్రీరామ నవమి సందర్భంగా హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టనున్న హిందూ విజయ యాత్ర (బైక్ ర్యాలీ)ను విజయవంతం చేయాలని సమితి అధ్యక్షుడు నాగపురి వెంకటేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. కాజీపేట మీడియా పాయింట్‌లో ఆయన విజయ యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కడిపికొండ బ్రిడ్జి వద్ద ప్రారంభమై సుబేదారి, హనుమకొండ చౌరస్తా మీదుగా పోచమ్మమైదాన్‌లోని దుర్గేశ్వరాలయం వరకు శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. సాయిశర్మ అయ్యర్, బీజేపీ నాయకులు నార్లగిరి రామలింగం, కాయిత రాజ్‌కుమార్, రాష్ట్రీయ హిందూ సేన రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్, హిందూ సేవా సమితి సభ్యులు వెంకట్‌రెడ్డి, గోగికర్, క్రాంతి, రానా, నవీన్ పాల్గొన్నారు.

కడియం డౌన్‌డౌన్..

షోడాశపల్లిలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం బీఆర్ఎస్ శ్రేణులు

వేలేరు, ఏప్రిల్ 4 : మండలంలో సన్న బియ్యం పంపిణీలో భాగంగా పర్యటించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన వేలేరు బీఆర్ఎస్ నాయకులు షోడాశపల్లి గ్రామంలో కడియం శ్రీహరి దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. కడియం డౌన్‌డౌన్ అని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కనీస విలువలు పాటించని కడియంకు పల్లాను విమర్శించే స్థాయి లేదన్నారు. ఇకపై పల్లాను కడియం విమర్శిస్తే ఆయన ఎక్కడ మీటింగ్ పెట్టినా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి భూపతిరాజు, మాజీ వైస్ ఎంపీపీ ఆంగోత్ సంపత్, మాల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు జానీ పాల్గొన్నారు.

గ్రేటర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం

- నాలుగు రోజులుగా వివిధ కాలనీల్లో పర్యటన
- మరో రెండు రోజులు నగరంలోనే..

వరంగల్, ఏప్రిల్ 4 : నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం నాలుగు రోజులుగా పర్యటిస్తున్నది. దేశ వాప్యంగా స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో పాల్గొంటున్న నగరాల్లో పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ర్యాంకులు ఇచ్చే క్రమంలో సభ్యులు గ్రేటర్‌లో పర్యటిస్తున్నారు. నగరంలోని పలు కాలనీలు, సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, మురికి వాడల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరణ, పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణ, తడి, పొడి చెత్తను వేరు చేసే విధానాలను పరిశీస్తున్నారు. శుక్రవారం అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో సభ్యులు పర్యటించారు. ఇంటింటా చెత్త సేకరణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేషన్ అందిస్తున్న సేవలు ఎలా ఉన్నాయని ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం మరో రెండు రోజుల పాటు నగరంలో పర్యటించనున్నది. ఈ నెల 6వ తేదీ వరకు నగరంలో పర్యటించి పలు కేటగిరీల్లో మార్కులు వేయనున్నారు. డంపింగ్ యార్డులో చెత్త శుద్ధి విధానాన్ని ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకోనున్నారు. డివిజన్లలో పర్యటిస్తున్న సభ్యులు చివరి రెండు రోజులు డంపింగ్ యార్డుకు వెళ్లనున్నారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేసేందుకు అవలంభిస్తున్న పద్ధతులు, మానవ వ్యర్థాల నుంచి తయారు చేస్తున్న ఎరువులను పరిశీలించనున్నారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4 : తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎంఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాలోని నాలుగు మైనారిటీస్ గురుకుల పాఠశాలల్లో (ఇంగ్లిష్ మీడియం) 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 30 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మురళీధర్ రెడ్డి తెలిపారు. 5, 6, 7, 8వ (మైనారిటీల బ్యాక్ లాగ్ ఖాళీలు) తరగతులు, ఇంటర్మీడియట్‌లో అర్హులైన విద్యార్థులు www.tmreis.telangana. gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రసాద్ తొలగింపు

డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డీడీ రాంరెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4 : బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన ఎంపీవీ ప్రసాద్ కొనసాగుతుండడంపై విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. అటు పెన్షన్, ఇటు డైరెక్టర్‌గా రెండు జీతాలు పొందుతుండడం సరికాదని, ఆయనను తొలగించాలని ఆందోళనలు చేపట్టారు. స్పందించిన ప్రభుత్వం రాష్ట్రంలోని సంక్షేమ శాఖలో కొనసాగుతున్న రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ కమిషనర్ బాలమాయదేవి జిల్లా బీసీ స్టడీ సర్కిల్‌లో డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఎంపీవీ ప్రసాద్‌ను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా బీసీ సంక్షేమ శాఖ డీడీ రాంరెడ్డి శుక్రవారం ప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ఉపాధి కల్పనకు ప్రత్యేక కృషి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

పరకాల, ఏప్రిల్ 4 : రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణ శివారులోని లలిత కన్వెన్షన్ హాలులో జాబ్ మేళా, మున్సిపాలిటీ కార్యాలయంలో కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించి జీవన ప్రమాణాలు మేరుగు పర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఇప్పటికే ప్రభుత్వ శాఖల్లో గ్రూప్ 1, 2, 3, 4తో పాటు పలు నోటిఫికేషన్ల ద్వారా భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. అంతే కాకుండా యువతలో నైపుణ్యాలను మెరుగు పర్చేందుకు స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, పావెన్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్లేశ్ (ఫైల్)

ధర్మసాగర్, ఏప్రిల్ 4 : రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి చెందిన ఘటన ఎలుకుర్తి గ్రామ పరిధిలోని ఎన్‌హెచ్ రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ గ్రామానికి చెందిన ఆవుల మల్లేశ్ యాదవ్ (30) మడికొండలోని ఓ సీడ్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. గురువారం పనికి వెళ్లి తిరిగి తన ద్విచక్రవాహనంపై ఇంటి వస్తున్న క్రమంలో ఎలుకుర్తి గ్రామం ఎన్‌హెచ్ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొన్నాడు. అటుగా వెళ్తున్న బాటసారులు అతడిని చూసి చికిత్స కోసం దవాఖానకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మడికొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జిల్లా కోర్టులో బాంబు కలకలం

- జడ్జికి ఆగంతకుడి మెయిల్
- కోర్టులో బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు.. బెదిరింపుగా నిర్ధారణ

హనుమకొండ అదాలత్‌లోని కోర్టు ఆవరణలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

సుబేదారి, ఏప్రిల్ 4 : హనుమకొండ అదాలత్‌లోని జిల్లా కోర్టు కార్యాలయంలో బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. కోర్టులో బాంబు పెట్టినట్లుగా ప్రధాన న్యాయమూర్తికి శుక్రవారం ఉదయం ఓ ఆగంతకుడి నుంచి మెయిల్ వచ్చింది. సమాచారం అందుకున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బందిని రంగలోకి దింపారు. బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది కోర్టుకు రావడంతో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు బయటకు పరుగులు పెట్టారు. బాంబు, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది కోర్టులో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సిబ్బంది హాల్, రికార్డు గదులు, కోర్టు ఆవరణలో అణువణువూ తనిఖీ చేశారు. చివరికి బాంబు లేదని తేల్చారు. వట్టి బెదిరింపు మెయిల్ అని నిర్ధారించారు. దీంతో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, వరంగల్ కోర్టులో బాంబు కలకలం రాష్ట్రవ్యాప్తంగా సంచనలంగా మారింది.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

హనుమకొండ, ఏప్రిల్ 4 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాలు మే 20న అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయని, సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ కోరారు. శుక్రవారం హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో లేబర్ కోడ్‌లను ప్రభుత్వం అనధికారికంగా అమలు చేస్తున్నదని, తక్షణమే అలాంటి చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 8 గంటలకు బదులు 12 గంటలు పని చేయించి తక్కువ వేతనాలు ఇచ్చి ఈఎస్ఐ, పీఎఫ్ లేకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. గౌరవ వేతనం పేరుతో స్కీం వర్కర్లకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని మండిపడ్డారు. ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు సామాజిక న్యాయ వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పెండ్యాల రవి, రజిత, జనగాని శ్వేత పాల్గొన్నారు.

ఇంకా పూర్తికాని పైపులైన్ మరమ్మతు

కంప్రెషర్‌తో బుంగను గుర్తిస్తున్న ఏజెన్సీ సిబ్బంది

ధర్మసాగర్, ఏప్రిల్ 4 : ధర్మసాగర్ రిజర్వాయర్ సమీపంలోని దేవాదుల ప్రాజెక్టు 3వ దశ పైపులైన్‌కు మరమ్మతులు ఇంకా పూర్తికాలేదు. పైపులైన్ లీకై టన్నెల్ నుంచి నీళ్లు వస్తుండడంతో టన్నెల్‌కు అతి సమీపంలోనే బుంగపడి నీళ్లు వృథాగా పోయాయి. దీంతో 3వ దశ పంపింగ్ మోటర్లు ఆఫ్ చేయగా, ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి 3వ దశ ద్వారా నీళ్లు రావడం లేదు. పైపులైన్‌కు రంధ్రం పడిన చోటును గుర్తించడంలో, టన్నెల్ వేసిన స్థలంలో బుంగ పడిన చోట మరమ్మతులు ఇంకా చేస్తూనే ఉన్నారు. దీంతో ఇప్పట్లో ఈ ఫేజ్ ద్వారా నీటిని పంపింగ్ చేయడం అసాధ్యమని తెలుస్తున్నది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

కాజీపేట, ఏప్రిల్ 4 : మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురికి జైలు, మరో 15 మందికి న్యాయమూర్తి శుక్రవారం జరిమానా విధించారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మంది పట్టుబడినట్లు తెలిపారు. కోర్టు కానిస్టేబుల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 21 మందిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఫాతిమా చిన్నప్ప ఎదుట హాజరుపర్చారు. మోతాదుకు మించి మద్యం తాగినన తురాయి బాలు, మ్యాక రాజు, కుంచం జంపన్న, చామళ్ల రవీందర్, నక్క చంద్రశేఖర్, ఎకరా మూతలయ్యకు న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అలాగే మరో 15 మందికి రూ.23,200 జరిమానా విధించారన్నారు. జైలు శిక్షపడిన వారిని పరకాల సబ్ జైలుకు తరలించామని చెప్పారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4 : సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం సహాయ ఆచార్యులు రెహమాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఆయనను అభినందించారు.

కాలంచెల్లిన కూల్ డ్రింక్స్ పట్టుకున్న పోలీసులు

కమలాపూర్, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని కూల్ డ్రింక్స్ డీలర్ షాపులో కాలం చెల్లిన కూల్ డ్రింక్స్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల మండలంలోని ఉప్పల్ గ్రామంలో ఓ కిరాణా షాపు యజమానికి సదరు డీలర్ కూల్ డ్రింక్స్ అమ్మాడు. షాపు యజమాని కూల్ డ్రింక్స్ చూసుకోకుండా విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తులు కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ ఎందుకు ఇచ్చావని ప్రశ్నించారు. దీంతో షాపు యజమాని సదరు డీలర్‌కు ఫోన్ చేసి కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ ఎందుకు పంపించారని అడుగగా, సరైన సమాధానం చెప్పకపోగా తనతో దురుసుగా మాట్లాడాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కూల్ డ్రింక్స్ డీలర్ షాపులో తనిఖీ చేయగా, రూ. 15,483 విలువైన కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ పట్టుబడినట్లు చెప్పారు. కూల్‌డ్రింక్స్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హేమలత శీతల పానీయాల ఏజెన్సీ యజమాని మాటం రాజబోసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

సఖీ ఆధ్వర్యంలో మహిళ లకు అవగాహన

ఎల్కతుర్తి, ఏప్రిల్ 4 : హనుమకొండ సఖీ కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వల్భాపూర్ గ్రామంలో మహిళలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖీ లీగల్ అడ్వైజర్ శ్రీదేవి, కేస్ వర్కర్ అనూష సఖీ సెంటర్ అందిస్తున్న వైద్యం, పోలీస్, తాత్కాలిక వసతి, కౌన్సెలింగ్ తదితర సేవలపై మహిళలకు తెలిపారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపుల నుంచి రక్షణ పొందడానికే సఖీ సెంటర్ పనిచేస్తుందని చెప్పారు. మహిళలకు ఏ సమస్య ఉన్నా 181 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలన్నారు. వీవో రజిత పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే గండ్ర

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట, ఏప్రిల్ 4 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని గట్టకానిపర్తిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఒక్క ఇందిరమ్మ ఇంటికి రూ.5లక్షలు ప్రభుత్వం అందిస్తుందని, నిరుపేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, దూదిపాల బుచ్చిరెడ్డి, చల్లా చక్రపాణి, పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బత్తిని సత్యనారాయణ ఉన్నారు.

కలెక్టర్, డీఐజీకి చేరిన సబ్ రిజిస్ట్రార్ వివరణ

హనుమకొండ, ఏప్రిల్ 4 : గత నెల 26న వరంగల్ ఆర్వో కార్యాలయంలో కంప్యూటర్ క్యాబిన్‌లో డాక్యుమెంట్ రైటర్ ఉద్యోగిగా మారిన ఘటనకు సంబంధించిన నివేదికను కలెక్టర్, డీఐజీకి జిల్లా రిజిస్ట్రార్ పంపించినట్లు తెలిసింది. డాక్యుమెంట్ రైటర్ ఉద్యోగి అవతారంఎత్తి డాక్యుమెంట్ ఫీడింగ్, ఫొటో క్యాప్చర్ చేయడంపై పలు పత్రికల్లో రావడంతో బాధ్యులైన సబ్ రిజిస్ట్రార్‌పై కలెక్టర్, డీఐజీ సీరియస్ అయి సబ్ రిజిస్ట్రార్ నుంచి వివరణ పంపించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించిన విషయం విదితమే. దీంతో జిల్లా రిజిస్ట్రార్ సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసు జారీ చేసి వివరణ ఇవ్వాలన్నారు. ఇందుకు సంబంధించిన వివరణను సబ్ రిజిస్ట్రార్ శుక్రవారం డీఆర్‌కు అందించినట్లు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ వివరణ విషయంలో జిల్లా రిజిస్ట్రార్ ఫణీంద్రను సంప్రదించగా సబ్ రిజిస్ట్రార్ వివరణ ఇచ్చింది వాస్తవమేనని, దాన్ని కలెక్టర్, డీఐజీకి పంపిస్తున్నామని, వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కమలాపూర్‌లో కుల బహిష్కరణ

- 24 కుటుంబాలకు ఇక్కట్లు
- న్యాయం చేయాలని వేడుకోలు

కమలాపూర్, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో ఒక వర్గాన్ని కుల బహిష్కరణ చేయడంతో 24 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని బాధితుడు బండి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కమలాపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. 2021 నుంచి 2023 వరకు మత్స్య పారిశ్రామిక కార్యవర్గ సభ్యుడుగా ఉన్నానని, ప్రతి ఏటా మత్స్యపారిశ్రామక సహకార సంఘంలో చెరువులు, కుంటల ద్వారా వచ్చే ఆదాయాన్ని లెక్కించామని, అప్పుడు అధ్యక్షుడిగా ఉన్న కొండ మొగిలి డబ్బులు కులానికి అప్పగిస్తానని చెప్పాడు. రూ.16లక్షలు సహకార సంఘానికి చెల్లించాలని అడిగితే రేపు మాపు అంటూ దాట వేసి ఏడాది తర్వాత చెల్లించినట్లు చెప్పారు. ఆ డబ్బులు బండి కుమారస్వామి వద్ద ఉంచామని, కులానికి డబ్బులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించడంతో మీ బండి వర్గానికి చెందిన వ్యక్తి వద్దే ఉన్నాయని, అతడితో పాటు మీ 24 కుటుంబాలను బహిష్కరిస్తున్నట్లు చెప్పారన్నారు. అప్పటి నుంచి శుభ కార్యాలకు వెళ్లినా, ఎవరైనా చనిపోయినా రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించి కులంలోకి రావాలని చెబుతున్నట్లు వాపోయారు. నూతన కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత నూతన అధ్యక్షుడు మురళిని సంఘంలో ఏం జరిగినా మమల్ని ఎందుకు పిలువడం లేదని అడిగితే ఆయన కూడా రూ.16లక్షలు చెల్లించి రావాలని ఆంక్షలు విధించినట్లు తెలిపారు. ఇటీవల ఉగాది పండుగకు రావాల్సిన చేపలను కూడా ఇవ్వలేదన్నారు. కుల బహిష్కరణతో మానసిక క్షోభకు గురవుతున్నామని, దయచేసి న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు.

వారం రోజుల్లో డంపింగ్ యార్డు డీపీఆర్

వరంగల్, ఏప్రిల్ 4 : వారం రోజుల్లో రాంపూర్ డంపింగ్ యార్డు సమర్థ నిర్వహణకు రాంకీ సంస్థ డీపీఆర్ సిద్ధం చేయనున్నట్లు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భద్రయ్య

పరకాల, ఏప్రిల్ 4 : పరకాల బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పెండేల భద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో 2025-26వ సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహ్మద్ సాబీర్, కోశాధికారిగా రాహుల్ విక్రమ్, కార్యవర్గ సభ్యుడిగా ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తాం..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

మేయర్ సుధారాణితో కలిసి సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

వరంగల్, ఏప్రిల్ 4 : నిరుపేదలకు సన్న బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మేయర్ గుండు సుధారాణితో కలిసి రామన్నపేటలో సన్న బియ్యం పంపిణీ ప్